# రమణ భాస్కర

## ఆధ్యాత్మిక పక్షపత్రిక

05-02-2005 (10)



శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమ గోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్, పిన్ : 534 265

| సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు | | |
|---|---|---|
| 07-02-05 | సోమ | గుమ్మలూరు |
| 09-02-05 | బుధ | మురమళ్ళ, వీరేశ్వరస్వామివారి దేవస్థానం |
| 10-02-05 | గురు | భీమవరం, క్షత్రియ పరిషత్ భవనము |

# ఆత్మ ధ్యాసే జ్ఞానం

మన హృదయంలో మన మనస్సు నిశ్చలంగా ఉండటమే జ్ఞానం. అదే భక్తి, అదే కర్మ, అదే యోగము. మనస్సు భావశూన్య సద్భావ స్థితిలోకి రావడము ఆత్మానుభవము వేరు కాదు. గాలివేగం వల్ల అలలతో ఎగసిపడే కొలను, గాలి ఆగితే నిశ్చలంగా, గంభీరంగా, కేవలంగా నిలుస్తుంది. అలాగే ఆలోచనా ప్రవాహం ఆగితే మనస్సు నిర్మలత్వం చెంది ఆత్మాకారం చెందుతుంది. ఆత్మ ధ్యాస లేకపోతే వాసనలు, మనస్సును కుదురుగా ఉండనియ్యవు. మనస్సు దాని అలవాట్లు అది మాననప్పడు, మన అభ్యాసం మనం విడిచిపెట్టకూడదు. సముద్రంలో ఒక రకమైన ముత్యపు చిప్ప ఉంటుంది. అది నీటి ఉపరితలంపై ఈదులాడుతూ ఉంటుంది. స్వాతి నక్షత్ర కాలంలో వానచినుకు దాని నోట్లో పడితే అది తన నోటిని బంధించి, సముద్రపు అడుగునకు చేరి, స్వచ్ఛమైన ముత్యం తయారయ్యే వరకూ తన నోటిని తెరువదు, ఆ ధ్యాస అటువంటిది. అలాగే ఆధ్యాత్మిక సాధకుడు ఆత్మ సాధన చేస్తూ, పరిపక్వ స్థితికి వచ్చిన తరువాత, సద్గురువు దొరికినప్పడు "నీవు ఆత్మే" అన్న ఆయన ఉపదేశాన్ని త్రికరణశుద్ధిగా నమ్మి, ఏకాగ్రతను సాధించి, నోటిని, చెవులను, కళ్ళను, చెడు విషయాలపై వెళ్ళకుండా మూసుకొని, ఆత్మ ముత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకొంటాడు. మనస్సు బహిర్ముఖం అవ్వటానికి ఈ మూడు ఇంద్రియాలే ప్రధాన ద్వారాలుగా ఉండి, మనలో భ్రాంతులను ప్రవేశించటానికి కారణమౌతున్నాయి. తన ఇంద్రియాలను నిత్యం తృప్తి పరచటానికి మానవుడు విశ్రాంతి లేకుండా ప్రకృతిలో సంతోషం కోసం వెదుకుతూ ఉంటాడు. అవికొన్ని పొందినపుడు, కొన్ని పొందలేనప్పడు, కలిగే రాగ-ద్వేషాల రాపిడిలో సతమతమౌతూ, తాను వేరు ప్రకృతి వస్తువులు వేరని, నిత్యం భ్రమిస్తూ జీవిస్తాడు. ఈ మాయా భ్రమణం ఆగాలంటే, ప్రకృతి వస్తువుల్లో నిజమైన ఆనందం దొరకదని గురుభోదతో నిశ్చయజ్ఞానంతో, మనస్సు ధృడపడినప్పడు మాత్రమే, ఆత్మధ్యాసలో సుఖంగా ఉంటాడు. "కోరికలు నశిస్తే మనస్సు నశిస్తుంది. అహంకార పంజరం నుండి బైట పడ్డ పక్షివలె భ్రాంతిని విడిచి ఆత్మానుభవంలో స్వేచ్ఛగా ఉంటుంది" అంటోంది యోగవాసిష్ఠము. కాబట్టి భ్రాంతులను వదలి జ్ఞానాన్ని పొందాలి.

సాగిరాజు రామకృష్ణంరాజు

**అర్ధవరం**